కనులపండువగా తిరు కల్యాణోత్సవం


స్వామివారి తిరు కల్యాణోత్సవంలో పాల్గొన్న విశిష్ట అతిథులు

కీసర: చీర్యాల లక్ష్మీనృసింహస్వామి దేవస్థానం సప్తదశ (17)వ వార్షిక బ్రహ్మోత్సవాల్లో ముఖ్య ఘట్టమైన స్వామివారి తిరు కల్యాణోత్సవాన్ని శనివారం యాదాద్రి దేవాలయ ప్రధానార్చకులు నల్లందిగులు నృసింహాచార్యులు ఆధ్వర్యంలో వేలాదిగా తరలివచ్చిన భక్తుల జయజయ ధ్వానాల మధ్య వైభవంగా స్వామివారి తిరు కల్యాణమహోత్సవాన్ని నిర్వహించారు. ఉదయం మంత్రి పొన్నం ప్రభాకర్ స్వామివారిని దర్శించుకుని, ప్రభుత్వం తరపున స్వామివారికి పట్టువస్త్రాలు అందజేశారు. కల్యాణోత్సవంలో రాష్ట్ర రెవెన్యూ రిజిస్ట్రేషన్‌శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ నవీన్‌మిట్టల్ దంపతులు, ఆలయ చైర్మన్ మల్లారపు లక్ష్మీనారాయణ దంపతులు పాల్గొన్నారు. అనంతరం భక్తులకు అన్నప్రసాద వితరణ చేపట్టారు. రామగుండం ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్, మేడ్చల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు సింగిరెడ్డి హరివర్ధన్‌రెడ్డి, టీపీసీసీ ఉపాధ్యక్షుడు తొటకూర వజ్రేష్‌యాదవ్, కేంద్రమాజీ బీసీ కమిషన్ సభ్యులు తల్లోజు ఆచారి, మాజీ ఎంపీపీ ఇందిరా లక్ష్మీనారాయణ, నాగారం మున్సిపల్ మాజీ చైర్మన్ చంద్రారెడ్డి, బీజేపీ నేతలు ఏనుగు సుదర్శన్‌రెడ్డి, ఆలయ ధర్మకర్త శ్రీహరిగౌడ్, తదితరులు స్వామివారి కల్యాణోత్సవంలో పాల్గొన్నారు.





పరీక్ష ఫలితాలపై ఆందోళన వద్దు !

మేడ్చల్ డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఉమాగౌరి



సాక్షి,సిటీబ్యూరో: పరీక్షల ఫలితాల నేపథ్యంలో విద్యార్థుల మానసిక ఆరోగ్యంపై తగిన జాగ్రత్తలు తీసుకుంటున్నామని మేడ్చల్, మల్కాజిగిరి జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి డాక్టర్ సి.ఉమాగౌరి తెలిపారు. కేంద్ర, రాష్ట్రప్రభుత్వాలు సంయుక్తంగా ప్రారంభించిన ‘టెలిమానస్’ సేవలను ఉపయోగించుకోవాలని ఆమె పేర్కొన్నారు. 24 గంటలు అందుబాటులో ఉండే ఉచిత ‘టెలి మానస్’ ఆరోగ్య సహాయక సేవలను పరీక్షల ఫలితాలతో ఒత్తిడికి లోనయ్యే విద్యార్థులు, తల్లిదండ్రులు, మానసిక ఒత్తిడితో బాధపడుతున్న ప్రతి ఒక్కరికీ ఓ కీలక మద్దతుగా నిలుస్తుందన్నారు. విద్యార్థులు ఎదుర్కొనే ప్రతీ సవాల్‌లో టెలి మానస్‌ను సంప్రదించడంలో ఏ మాత్రం వెనకాడొద్దని ఆమె సూచించారు. గత అనుభవాల దృష్ట్యా పరీక్షల ఫలితాల సమయంలో విద్యార్థులు ఒత్తిడిని లోనవుతున్నారన్నారు. కొన్ని సందర్భాల్లో ఆత్మహత్యయత్నాలకు దారితీసిన ఉదంతాలు కూడా చూశామన్నారు. ఇలాంటి ఘటనలు జరగకుండా ఉండేందుకు ముందస్తు చర్యలు చేపడుతున్నట్లు డీఎంహెచ్‌ఓ స్పష్టం చేశారు. టెలి మానస్ హెల్ప్‌లైన్ నంబర్లు 14416 లేదా 1800-891-4416.

ఆటిజం సెంటర్‌పై ఫిర్యాదు

సాక్షి, సిటీబ్యూరో: ఇటీవల కాలంలో జంట నగరాల్లో అనుమతి లేకుండా అనేక థెరపీ సెంటర్లు మాయలో పడి పలువురు ఆటిజం బాధిత చిన్నారుల తల్లిదండ్రులు మోసపోతున్నారు. ఈ తరహా ఆటిజం సెంటర్ల నిర్వాహకులపై ఫిర్యాదులు పెరుగుతున్నా.. బయటికి రావడం లేదు. ఈ నేపథ్యంలో కొంపల్లిలోని జైన్ ఫ్రెండ్స్ స్క్వేర్‌లో చైల్డ్ డెవలప్‌మెంట్ సెంటర్‌ను నిర్వహిస్తున్న అశోకా సంస్థపై పేట్ బషీరాబాద్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. సదరు సెంటర్‌లో శిక్షణ తీసుకుంటున్న వినికిడి లోపంతో బాధపడుతున్న తన 11 ఏళ్ల పాపపై నిర్వాహకులు, శిక్షకులు చేయి చేసుకున్నారని, ఇదేమని ప్రశ్నించిన తమపై కూడా దురుసుగా ప్రవర్తించారని పేర్కొంటూ.. చిన్నారి తండ్రి గత శనివారం పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు సమచారం.

బీఆర్ఎస్ రజతోత్సవ సభకు ఏర్పాట్లు ముమ్మరం

- ప్రతీ నియోజకవర్గం నుంచి 3 వేల నుంచి 5 వేల మంది
- బస్సులు, సొంత వాహనాలతో వచ్చేందుకు ఏర్పాట్లు

సాక్షి,సిటీబ్యూరో: హన్మకొండ జిల్లాలోని ఎల్కతుర్తిలో నేడు నిర్వహించే రజతోత్సవ బహిరంగసభకు 15 వేల మంది ప్రజలను తరలించేందుకు మేడ్చల్, మల్కాజిగిరి జిల్లా బీఆర్ఎస్ కమిటీ కసరత్తు చేస్తోంది. ప్రతీ నియోజకవర్గం నుంచి 3 వేల నుంచి 5 వేల మంది ప్రజలను తరలించేందుకు ఏర్పాట్లు చేసినట్లు జిల్లా బీఆర్ఎస్ అధ్యక్షుడు శంభీపూర్ రాజు తెలిపారు. ప్రతీ నియోజకవర్గంలో పార్టీకి చెందిన మాజీ మంత్రులు, ఎమ్మెల్యేలు సభను విజయవంతం చేసేందుకు విస్తృతంగా ప్రచారం నిర్వహించినట్లు పేర్కొన్నారు.

◆ నగర శివారు మేడ్చల్ జిల్లాలో వాల్‌రైటింగ్, ఫ్లెక్సీలను కూడా ప్రతీ కూడళ్లలో ఏర్పాటు చేసి, పండుగ వాతావరణాన్ని కలిగించామన్నారు.

పదేళ్లలో ఎంతో అభివృద్ధి..

బీఆర్ఎస్ అధికారంలో ఉన్న పదేళ్లలో మేడ్చల్, మల్కాజిగిరి జిల్లా ఎంతో అభివృద్ధి చెందిందని శంభీపూర్ రాజు పేర్కొన్నారు. పురపాలక సంఘాలు, గ్రామ పంచాయతీలు, జీహెచ్ఎంసీ పరిధిలోని మున్సిపల్ సర్కిళ్లు, డివిజన్‌లో ఎన్నడూ లేని అభివృద్ధి జరిగిందన్నారు. ప్రస్తుత ప్రభుత్వం గత ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి పనుల నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించలేకపోతుందని విమర్శించారు.



పహల్గాం మృతులకు నివాళి

మేడ్చల్: కశ్మీర్‌లోని పహల్గాంలో ముష్కరుల చేతిలో బలైన వారికి మేడ్చల్‌లో ఘనంగా నివాళులర్పించారు. పార్టీలకు అతీతంగా ప్రతిరోజూ సాయంత్రం ఏదో ఒక ప్రాంతంలో రాజకీయాలకు అతీతంగా నివాళులర్పిస్తున్నారు. పాకిస్తాన్‌కు కేంద్రం సరైన బుద్ధి చెప్పాలని డిమాండ్ చేస్తున్నారు. పట్టణంలోని బాలాజీనగర్, చంద్రానగర్, వెంకట్రామ్‌రెడ్డి కాలనీల్లో కాలనీల అసోసియేషన్లు క్యాండిల్ ర్యాలీలు నిర్వహించారు.

బీఆర్ఎస్ సభను విజయవంతం చేయాలి

జవహర్‌నగర్: వరంగల్ సభకు మేడ్చల్, మల్కాజిగిరి జిల్లాలోని ఉద్యమకారులు, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు అత్యధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని తెలంగాణ ఉద్యమకారుల ఫోరం మేడ్చల్, మల్కాజిగిరి జిల్లా అధ్యక్షులు జిట్టా శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. శనివారం ఆయన మాట్లాడుతూ.. బీఆర్ఎస్ రజతోత్సవ సభకు ప్రజలు స్వచ్ఛందంగా మద్దతిస్తున్నారన్నారు. దేశంలోని ఏ ప్రాంతీయ పార్టీలు ఇంత పెద్దఎత్తున సభను నిర్వహించలేదని, బీఆర్ఎస్ రజతోత్సవసభ చరిత్రలో నిలిచిపోతుందన్నారు. వరంగల్ ఎల్కతుర్తిలో నిర్వహిస్తున్న రజతోత్సవ సభను విజయవంతం చేయాలని ఆయన కోరారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం

పోచారం: చౌదరిగూడలోని నల్ల నర్సింహారెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో శనివారం పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఘనంగా నిర్వహించారు. 2009 విద్యా సంవత్సరం నుంచి సుమారు 150 మంది విద్యార్థులు సమ్మేళనంలో పాల్గొని కళాశాలలో గడిపిన రోజుల్లోని తీపి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. ముఖ్య అతిథిగా కళాశాల వైస్ చైర్మన్ నల్ల ప్రశాంత్‌రెడ్డి పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ.. పూర్వ విద్యార్థులు తమ అనుభవాలను, ఆలోచనలను పంచుకోవడం అభినందనీయమన్నారు. సీఈఓ సంపత్ రెడ్డి, అల్యూమినీ కన్వీనర్ జనార్దన్ రాజు, కో- ఆర్డినేటర్ డా. సుబ్బారావు, డీన్లు డా. కృష్ణమోహన్, డా. రవీందర్‌రెడ్డి, టీపీఓ శ్రీకాంత్, అల్యూమినీ అసోసియేషన్ కోశాధికారి అరవింద, సహాయ కార్యదర్శి ఉదయ్, సభ్యుడు ఉదయ్ కుమార్‌రెడ్డి పాల్గొన్నారు.







వడదెబ్బతో వ్యక్తి మృతి

ఘట్‌కేసర్: వడదెబ్బకు గురై ఘట్‌కేసర్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఓ వ్యక్తి మృతి చెందాడు. ఎస్సై నరసింహ తెలిపిన వివరాల ప్రకారం.. నగరంలోని మైలార్‌దేవ్‌పల్లికి చెందిన అహ్మద్ (35) జీవనోపాధి కోసం వారం రోజుల క్రితం ఘట్‌కేసర్‌కు వచ్చాడు. వరంగల్–హైదరాబాద్ జాతీయ రహదారి ఘట్‌కేసర్ బైపాస్ రోడ్డు వందన హోటల్ సమీపంలో ఓ చెట్టుకింద శనివారం మధ్యాహ్నం అపస్మారక స్థితిలో పడి ఉన్నాడు. గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం ఇవ్వగా ఆయనను స్థానిక ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే అతడు మృతి చెందినట్లు ధ్రువీకరించారు. అతడి ఐడీ ఆధారంగా కుటుంబసభ్యులను సమాచారం అందించి మృతదేహాన్ని అప్పగించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

మేడ్చల్ : డబీల్‌పూర్ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం పరిధిలోని కోనాయిపల్లిలో మేడ్చల్ మార్కెట్ కమిటీ ఆధ్వర్యంలో కోనాయిపల్లిలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని మార్కెట్ కమిటీ చైర్మన్ నర్సింహులుయాదవ్ శనివారం ప్రారంభించారు. గ్రామపంచాయతీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన డైరెక్టర్లు, కాంగ్రెస్ నేతలతో కలిసి ప్రారంభించారు. రైతులు తాము పండించిన వరిధాన్యాన్ని దళారులకు విక్రయించకుండా కొనుగోలు కేంద్రంలో విక్రయించాలని కోరారు. సన్నరకానికి ప్రభుత్వం నిర్దేశించిన ధరతో పాటు రూ.500 బోనస్ ఇస్తుందన్నారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. డబీల్‌పూర్ సొసైటీ చైర్మన్ సురేష్ రెడ్డి, డైరెక్టర్లు శంకర్, రాజు, మాజీ సర్పంచ్ సంజీవరావు, నాయకులు రమణారెడ్డి, వెంకటేష్, కొడె మహేష్, యూనుస్‌పాషా, దేవేందర్‌రెడ్డి, సొసైటీ డైరెక్టర్లు, రైతులు పాల్గొన్నారు.





ఉపాధ్యాయుల ప్రోత్సాహంతో ఉన్నత శిఖరాలకు చేరుకోవాలి

ఆల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత నరేందర్‌రెడ్డి

ఘట్‌కేసర్: ఉపాధ్యాయుల మార్గదర్శకంలో ఉత్తమ ప్రతిభ కనబరిచి, ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని, ఆల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత నరేందర్‌రెడ్డి అన్నారు. ఇంటర్మీడియట్‌లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన ఘట్‌కేసర్ అవుషాపూర్ ఆల్ఫోర్స్ విద్యార్థులకు శనివారం నిర్వహించిన అభినందన సభకు ముఖ్యఅతిథిగా ఆయన హాజరై మాట్లాడారు. విద్యార్థులకు మెరుగైన విద్యను అందించడంతోనే ఆల్ఫోర్స్ విద్యార్థులు విజయం సాధించారన్నారు. సీనియర్ ఎంపీసీ విభాగంలో అక్షయ్, అబ్దుల్ దిశాస్ 993, గురుచరణ్ 990, సీనియర్ బైపీసీలో నవీన్‌దాస్ 992, జూనియర్ ఎంపీసీలో వైష్ణవి 467, సమన్విత 466, వివేక్‌వర్ధన్ 465, జూనియర్ బైపీసీలో అర్బాజ్ 433 మార్కులు, రహీనాబేగం 428 మార్కులు సాధించారన్నారు. అనంతరం విద్యార్థులకు పుష్పగుచ్ఛం అందజేసి అభినందించారు. అధ్యాపకులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.



విద్యార్థులతో నరేందర్‌రెడ్డి



అనారోగ్యంతో మహిళ ఆత్మహత్య

ఘట్‌కేసర్: అనారోగ్యంతో ఓ మహిళ ఆత్మహత్య చేసుకున్న ఘటన ఘట్‌కేసర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. అడ్మిన్ ఎస్సై ప్రభాకర్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. ఘట్‌కేసర్ మున్సిపాలిటీ బాలాజీనగర్‌కు చెందిన జూపల్లి ఆరోగ్యం (45) కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతోంది. జీవితంపై విరక్తితో శనివారం మధ్యాహ్నం ఇంట్లో ఎవరూ లేని సమయంలో సీలింగ్ ఫ్యాన్‌కు చున్నీతో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. గమనించిన స్థానికులు వెంటనే స్థానిక ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతిచెందినట్లు ధ్రువీకరించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



నూతన విద్యా పద్ధతులతో ఉపాధి అవకాశాలు

జేఎన్టీయూహెచ్ మాజీ వైస్ చాన్స్‌లర్ రాజ్‌గోపాల్



ఘట్‌కేసర్: నూతన విద్యా పద్ధతుల ద్వారా స్వయం ఉపాధి అవకాశాలు పెంపొందించుకోవాలని జేఎన్టీయూహెచ్ మాజీ వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ రాజ్‌గోపాల్ అన్నారు. ఘనాపూర్ కొమ్మూరి ప్రతాపరెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో శనివారం నిర్వహించిన ఎక్స్‌పర్ట్ టాక్ కార్యక్రమానికి హాజరై మాట్లాడారు. కళాశాలలో మహిళల భద్రత, సంక్షేమం కోసం రక్షణసెల్‌ను కేపీఆర్ఐటీ డైరెక్టర్ ప్రొఫెసర్ సుధీర్ ప్రేమ్‌కుమార్, ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీనివాస్‌రెడ్డితో కలిసి ప్రారంభించారు. అనంతరం ఆరోహణ–2025, ఆటోఎక్స్‌పో–2025 పోస్టర్‌ను ఆవిష్కరించారు.



మంత్రి సీతక్కను కలిసిన స్థానిక నేతలు

కీసర: తెలంగాణ రాష్ట్ర పంచాయితీరాజ్, గ్రామీణాభివృద్ధి, స్త్రీ, శిశు సంక్షేమశాఖ మంత్రి సీతక్కను శనివారం బాలల హక్కుల కమిషన్ మెంబర్ గోగుల సరితావెంకటేష్, నాగారం మున్సిపాలిటీ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ముప్పు శ్రీనివాస్‌రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం పలు విషయాలపై చర్చించారు.


మంత్రి సీతక్కతో సరితావెంకటేష్, శ్రీనివాస్‌రెడ్డి



రాష్ట్ర సాధనకు విరామం లేకుండా పోరాడాం

మేడ్చల్: యువకులుగా ఉన్న సమయంలో తెలంగాణ కోసం కేసీఆర్ ప్రారంభించిన తెలంగాణ ఉద్యమంలో చేరి రాష్ట్ర సాధన వరకు విరామం లేకుండా పోరాటం చేశామన్నారు. మాజీ సీఎం కేసీఆర్ ప్రోత్సాహంతో తమ లాంటి బడుగు బలహీన వర్గాల నాయకులు నేడు మండల స్థాయి నాయకుల వరకు ఎదిగామన్నారు. ఉద్యమం సమయంలో కేసీఆర్‌ను ఎన్నోసార్లు ప్రత్యక్షంగా కలిసిన సమయాల్లో తమలాంటి వారికి గురువులా రాజకీయ ఓనమాలు నేర్పారన్నారు.

ప్రజల ఆశీర్వాదంతో మళ్లీ అధికారంలోకి వస్తాం

బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత

పోచారం: బీఆర్ఎస్ రజతోత్సవ వేడుకల సందర్భంగా శనివారం వరంగల్ వెళ్తున్న బీఆర్ఎస్ పార్టీ నాయకురాలు కల్వకుంట్ల కవితను అన్నోజిగూడ ఫ్లైఓవర్ వద్ద మాజీ కౌన్సిలర్ బెజ్జంకి హరిప్రసాదరావు కలిశారు. శనివారం ఆమె మాట్లాడుతూ.. ప్రజల ఆశీర్వాదంతో బీఆర్ఎస్ తిరిగి అధికారంలోకి వస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ నాయకులు శేఖర్‌ముదిరాజ్, మెట్టు బాల్‌రెడ్డి, శంకర్, కొమ్మిడి శ్రీనివాస్‌రెడ్డి, బద్దం జగన్మోహన్‌రెడ్డి, సింగిరెడ్డి సాయిరెడ్డి, బద్రునాయక్ తదితరులున్నారు.


ఎమ్మెల్సీ కవితతో మాజీ కౌన్సిలర్ హరిప్రసాదరావు



నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

మేడ్చల్‌రూరల్: విద్యుత్ మరమ్మతుల కారణంగా ఆదివారం కిష్టాపూర్ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని ట్రాన్స్‌కో అధికారులు తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు సబ్‌స్టేషన్ పరిధిలో వెల్‌సెట్, టైమ్ టెక్నో, సుమో బిస్కెట్, గోసాయిగూడ విలేజ్, కిష్టాపూర్ విలేజ్, ఐడియా హనుమాన్ తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదన్నారు.



కీసరలో మహాన్యాస పూర్వక రుద్రాభిషేకం

కీసర: కీసరగుట్ట రామలింగేశ్వరస్వామి దేవస్థానంలో శనివారం మాసశివరాత్రి సందర్భంగా స్వామివారికి మహాన్యాస పూర్వక రుద్రాభిషేకం ఆలయ అర్చకులు నిర్వహించారు. అనంతరం స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ చైర్మన్ నారాయణ, ఈవో సుధాకర్‌రెడ్డి, ఫౌండర్ ట్రస్టీలు, ట్రస్ట్ బోర్డు సభ్యులు పాల్గొన్నారు.


రుద్రాభిషేకం చేస్తున్న అర్చకులు

విద్యార్థులు స్వయం అభివృద్ధిని సాధించాలి

డీఆర్డీవో శాస్త్రవేత్త డాక్టర్ వీరబ్రహ్మం


మాట్లాడుతున్న డీఆర్డీవో శాస్త్రవేత్త డాక్టర్ వీరబ్రహ్మం

కీసర: బోగారంలోని హోలిమేరీ ఇంజినీరింగ్ కళాశాలలో కంప్యూటర్ సైన్స్, కమ్యూనికేషన్ ఇంజినీరింగ్‌పై రెండ్రోజుల పాటు నిర్వహించిన అంతర్జాతీయ సమావేశం శనివారం ముగిసింది. ఈ కార్యక్రమానికి డీఆర్డీవో శాస్త్రవేత్త డాక్టర్ కె.వీరబ్రహ్మం మాట్లాడుతూ.. భవిష్యత్తులో ఏఐదే ముఖ్య పాత్రని, దీనికి తగినట్లుగా విద్యార్థులు అభివృద్ధి చెందాలన్నారు. అనంతరం ఎన్ఐటీ ప్రొఫెసర్ డాక్టర్ జె.రవికుమార్ నూతన ఆవిష్కరణ గురించి వివరించారు. దేశంలోని వివిధ రాష్ట్రాల నుండి వచ్చిన అధ్యాపకులు, విద్యార్థులు సమర్పించిన 1400 పరిశోధనల్లో 370 పత్రాలను ఆమోదించారు. ఉస్మానియా యూనివర్సిటీ ఈసీఈ ప్రొఫెసర్ డాక్టర్ నవీన్‌కుమార్, కళాశాల చైర్మన్ సిద్ధార్థరెడ్డి, ప్రొఫెసర్ కృష్ణారెడ్డి, ప్రిన్సిపాల్ డాక్టర్ జేబీవీ.సుబ్రహ్మణ్యం, కార్యనిర్వాహక కార్యదర్శి జీవన్‌కుమార్ తదితరులున్నారు.